'కల్కి'లో అతిథులుగా...?



'కల్కి 2898 ఏడీ' విడుదల దగ్గరపడుతుండటంతో చిత్ర బృందం ప్రచార పర్వాన్ని వేగవంతం చేసింది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సైన్స్ ఫిక్షన్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఆదివారం పురాణపురుషుడైన అశ్వత్థామగా అమితాబ్‌బచ్చన్‌ను పరిచయం చేస్తూ విడుదల చేసిన గ్లింప్స్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పడుకోన్ వంటి అగ్ర తారలు భాగమైన విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం తెలుగు యువహీరోలు నాని, విజయ్ దేవరకొండ 'కల్కి' చిత్రంలో అతిథి పాత్రల్లో మెరవనున్నట్లు తెలిసింది. ఈ సినిమాలో మలయాళ అగ్రహీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో నాని, విజయ్ దేవరకొండ గెస్ట్ అప్పీయరెన్స్ ఇవ్వబోతున్నారనే వార్త అభిమానుల్లో మరింత జోష్‌ను నింపుతున్నది. అయితే ఇందులో నిజానిజాలు తెలియాలంటే చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. మహాభారతకాలం నాడు మొదలై ఆరువేల సంవత్సరాల కాలవ్యవధిలో పూర్తయ్యే సైన్స్ ఫిక్షన్ కథాంశంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ముందస్తుగా ప్రకటించిన తేదీ ప్రకారం మే 9న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురావాల్సి ఉంది.

స్మగ్లర్ల ఆటకట్టించే 'కూలీ'

సూపర్‌స్టార్ రజనీకాంత్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఆయన ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. రజనీకాంత్ 171వ చిత్రమిది. సోమవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు 'కూలీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని దర్శకుడు లోకేష్ కనకరాజ్ తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. టీజర్ యాక్షన్ హంగులతో ఆకట్టుకుంది. గోల్డ్‌బిస్కెట్స్ స్మగ్లింగ్ చేసే ముఠా ఆటకట్టించే క్రమంలో రజనీకాంత్ చేసిన యాక్షన్ విన్యాసాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. దర్శకుడు లోకేష్ కనకరాజ్ తనదైన మార్క్‌తో సన్నివేశాలను తీర్చిదిద్దాడు. ఖైదీ, విక్రమ్ వంటి చిత్రాలతో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు లోకేష్ కనకరాజ్.. రజనీకాంత్ వంటి సూపర్‌స్టార్‌ను డైరెక్ట్ చేయడంతో ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాలో తెలుగు అగ్ర హీరో నాగార్జున కీలక పాత్రలో నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. లోకేష్ కనకరాజ్ గత చిత్రాలకు భిన్నంగా ప్రయోగాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని సమాచారం.

దుష్టశక్తి విజృంభించిన ప్రతిసారీ.. దాన్ని తుదముట్టించేందుకు దైవశక్తి ఉద్భవిస్తూనే ఉంది. దైవాంశగల కారణజన్ముడు పుడుతూనేవున్నాడు. హిరణ్యాక్షుడి నుంచి హిట్లర్ వరకూ చరిత్ర చెబుతున్న సత్యం అది. చిరంజీవి 'విశ్వంభర' కథ కూడా దాదాపుగా ఇదే. ఇరవై ఏళ్ల విరామం తర్వాత చిరంజీవి చేస్తున్న సోషియో ఫాంటసీ సినిమా ఇది. తొలి సినిమా 'బింబిసార'ను ఫాంటసీ కథతో తెరకెక్కించి, శభాష్ అనిపించుకున్న దర్శకుడు వశిష్ఠ.. ఈ మెగా ప్రాజెక్ట్‌కు దర్శకుడు కావడంతో సినిమాపై అంచనాలు ఎవరెస్ట్‌ని తాకాయి. త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మరికొందరు నాయికలు మెగాస్టార్‌తో జతకట్టనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న 'విశ్వంభర' విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా షూటింగ్ గత 26 రోజులుగా హైదరాబాద్‌లో నిరవధికంగా జరుగుతున్నది. టాలీవుడ్ ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాశ్ నిర్మించిన 54 అడుగుల హనుమాన్ విగ్రహంతో కూడిన భారీ సెట్‌లో స్టంట్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నారు. రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో రూపొందిస్తున్న ఈ భారీ పోరాట సన్నివేశాలు సినిమాకే హైలైట్‌గా నిలువనున్నాయని మేకర్స్ చెబుతున్నారు. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో వచ్చే ఈ ఫైట్ కోసం చిరంజీవి 26 రోజులు కేటాయించారు. ఆయన కెరీర్‌లో ఒక్క ఫైట్ సీక్వెన్స్ కోసం ఇన్ని రోజులు కేటాయించడం ఇదే ప్రథమం. ఈ షూట్ సోమవారంతో పూర్తయింది. మాస్‌ని మెస్మరైజ్ చేసేలా మెగా లెవల్లో ఈ ఫైట్ ఉండనుందని చిత్రబృందం తెలిపింది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె.నాయుడు.

26రోజులుగా జరుగుతున్న పోరాటం ముగిసింది

బంపరాఫర్ కొట్టేసింది..

గత ఏడాది కళ్లు మూసుకొని సినిమాలకు సంతకాలు చేసేసినట్టుంది శ్రీలీల. దాదాపుగా నెలకొక సినిమా విడుదలైంది. అయితే, వాటిలో భగవంత్‌కేసరి, గుంటూరుకారం మినహా మిగతా ఏ సినిమా కూడా ఈ ముద్దుగుమ్మకు కలిసిరాలేదనే చెప్పాలి. అందుకే ఈ ఏడాది మాత్రం ఆచితూచి సినిమాలను ఎంపిక చేసుకుంటున్నది. అందుతున్న సమాచారం మేరకు ఈ అందాలభామకు అదృష్టదేవత తమిళ్‌లో తలుపుతట్టిందని తెలుస్తున్నది. మైత్రీ మూవీమేకర్స్ వారు అజిత్ హీరోగా తమిళంలో నిర్మిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ చిత్రంలో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు చిత్రబృందం ఇప్పటికే ఆమెను సంప్రదించారని, కథ నచ్చడంతో ఆమె కూడా అంగీకారం తెలిపిందని పేర్కొంటూ తమిళనాట కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. ఇదే గనుక నిజమైన శ్రీలీల పంట పండినట్టే. కారణం అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై తమిళనాట భారీ అంచనాలు ఉన్నాయి. తమిళంలో తొలి అవకాశమే అజిత్ లాంటి సూపర్‌స్టార్‌తో రావడం అంటే చిన్న విషయం కాదు కదా.

శర్వా సినిమాలో రాజశేఖర్

హీరోగా గర్వించదగ్గ ప్రస్థానం డా.రాజశేఖర్‌ది. జనహృదయాల్లో చిరస్థాయిగా నిలిచుండే సినిమాల్లో నటించారాయన. నటుడిగా ఈ అల్లరిప్రియుడు ఎప్పటికీ జనప్రియుడే. ఆయన సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. రీసెంట్‌గా నితిన్ హీరోగా చేసిన 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్'లో ఓ కీలక పాత్ర పోషించిన రాజశేఖర్, త్వరలో శర్వానంద్ హీరోగా రూపొందుతోన్న చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషించనున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై అభిలాష్‌రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతున్నది. రాజశేఖర్ ఇటీవలే ఈ సినిమా సెట్‌లోకి ఎంట్రీ ఇచ్చినట్టు సమాచారం. ఈ సినిమాలో ఆయనది ఫుల్‌లెన్త్ కేరక్టర్ అని తెలుస్తున్నది. అయితే.. అది నెగెటీవ్ పాత్ర మాత్రం కాదట. శర్వానంద్ 36వ చిత్రంగా రానున్న ఈ సినిమాలో మాళవిక నాయర్ కథానాయిక.

టార్గెట్‌పై గురిపెట్టిన సత్యభామ

పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకుడు. బాబి తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మాతలు. పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే నెల 17న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. దీనికోసం ఓ క్రియేటివ్ వీడియోను కూడా విడుదల చేశారు. ఓ క్రైమ్ నుంచి రికవరీ చేసిన గన్ విడి పార్ట్స్ లోడ్ చేసి కాజల్ షూట్ చేయగా, అది క్యాలెండర్‌లో మే 17 డేట్‌ని టార్గెట్ చేస్తూ దూసుకెళ్తుంది. అప్పుడు 'సత్యభామ మే 17' అని రివీల్ అవుతుంది. ఈ కంటెంట్‌తోపాటు ఇప్పటివరకూ విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కూడా కొత్తగా ఉండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయని, సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. నవీన్‌చంద్ర ఇందులో అమరేంద్రగా కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్‌ది ప్రత్యేకమైన పాత్ర. చిత్రానికి కెమెరా: బి.విష్ణు, సంగీతం: శ్రీచరణ్ పాకాల, సమర్పణ: 'మేజర్'ఫేం శశికిరణ్ తిక్క.

డీప్‌ఫేక్ వీడియోపై ఫిర్యాదు

కృతిమ మేధస్సుతో సృష్టించే డీప్‌ఫేక్ వీడియోలు సినీ తారలకు కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. రష్మిక మందన్న మొదలుకొని ఇప్పటికే పలువురు అగ్ర తారలను లక్ష్యంగా చేసుకొని క్రియేట్ చేసిన వీడియోలు బాలీవుడ్‌లో కలకలం రేపాయి. తాజాగా ఓ పార్టీకి మద్దతుగా అగ్రహీరో రణ్‌వీర్‌సింగ్ మాట్లాడినట్లుగా తయారు చేసిన డీప్‌ఫేక్ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారంపై రణ్‌వీర్‌సింగ్ ముంబయి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'డీప్‌ఫేక్ నుంచి రక్షించండి మిత్రులారా' అంటూ ఆయన తన ట్విట్టర్ ఖాతాలో వ్యాఖ్యానించారు. రణ్‌వీర్‌సింగ్ డీప్‌ఫేక్ వీడియో వ్యవహారం వివరాల్లోకి వెళితే.. ఇటీవల రణ్‌వీర్‌సింగ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వారణాసిని సందర్శించారు. అక్కడ పలు దేవాలయాలను దర్శించుకున్న అనంతరం మీడియాతో ముచ్చటించారు. రణ్‌వీర్‌సింగ్ చెప్పిన మాటలను ఏఐ సాంకేతికతో మార్చివేసి ఆయన ఓ రాజకీయ పార్టీకి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించినట్లుగా చూపించారు. ఈ వీడియో గంటల వ్యవధిలోనే సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై వెంటనే స్పందించారు రణ్‌వీర్‌సింగ్. ఫేక్ వీడియోను నమ్మొద్దని అభిమానులను కోరారు. రణవీర్‌సింగ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

'ఆ ఒక్కటీ అడక్కు' ఆ లోటు తీరుస్తుంది

'నరేశ్ అద్భుతమైన నటుడు. తను వరుసగా కామెడీ సినిమాలు చేస్తుంటే, వాటికి కొంచెం బ్రేక్ ఇవ్వమని నేనే కోరాను. కానీ ఇప్పుడు ఈ ట్రైలర్ చూస్తుంటే, బ్రేక్ వల్ల తన కామెడీ మిస్ అయ్యానని అనిపించింది. 'ఆ ఒక్కటీ అడక్కు' నరేశ్ నాన్నగారైన ఈవీవీ సత్యనారాయణగారి టైటిల్. దానివల్ల స్పెషల్ కనెక్షన్ కామన్‌గా ఉంటుంది. అందరూ హాయిగా ఎంజాయ్ చేసే సినిమా ఇదని ట్రైలర్ చెప్పకనే చెబుతోంది. మే 3న నరేశ్‌తో కలిసి సినిమా చూస్తాను.' అని హీరో నాని అన్నారు. అల్లరి నరేశ్ నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు'. ఫరియా అబ్దుల్లా కథానాయిక. మల్లి అంకం దర్శకుడు. రాజీవ్ చిలక నిర్మాత. సోమవారం ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదల వేడుకకు అతిథిగా విచ్చేసిన నాని, ట్రైలర్‌ని విడుదల చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. '49సార్లు వివిధ అమ్మాయిలచే తిరస్కరణకు గురైన అబ్బాయి కథ ఇది. మ్యారేజ్ బ్యూరోలు సైతం అతనికి తగిన జోడీని వెతకే విషయంలో విఫలమైన నేపథ్యంలో అనుకోకుండా ఆ కుర్రాడు ఓ అమ్మాయి ప్రేమలో పడ్డాడు. అయితే.. తన రిలేషన్‌ని నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్లడానికి వారికి ఓ సమస్య వచ్చిపడుతుంది. అదేంటి? అనేది ఈ సినిమా కథ అని దర్శకుడు తెలిపారు. చాలారోజుల తర్వాత కామెడీ సినిమాతో వస్తున్నాననీ, తప్పకుండా అందర్నీ నవ్విస్తానని అల్లరి నరేశ్ నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. వెన్నెల కిశోర్, జామీ లివర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సూర్య, సంగీతం: గోపీసుందర్.

20ఏళ్ల తర్వాత..

మలయాళ చిత్రసీమలో మోహన్‌లాల్, శోభన హిట్ పెయిర్‌గా గుర్తింపును తెచ్చుకున్నారు. వారిద్దరూ కలిసి నటించిన నిరాట్టుకల్, ఇరుపట్టమ్, నూట్టనాడు, చెన్కోల్, మణిచిత్రతాజు వంటి చిత్రాలు అభిమానుల హృదయాల్లో నిలిచిపోయాయి. విశేషమేంటంటే, మళ్లీ 20 ఏళ్ల విరామం తర్వాత ఈజంట కలిసి నటించబోతున్నారు. ఈ అగ్ర తారలిద్దరూ కలిసి నటిస్తున్న తాజా చిత్రం సోమవారం ప్రారంభమైంది. మోహన్‌లాల్ నటిస్తున్న 360వ చిత్రమిది. ఈ సినిమా ఆన్‌లోకేషన్ స్టిల్స్‌ను మోహన్‌లాల్ తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత అద్భుత ప్రతిభావంతురాలైన శోభనతో కలిసి నటించడం ఆనందంగా ఉందని మోహన్‌లాల్ పేర్కొన్నారు. ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ మరలా జత కట్టడంతో కేరళలోని వారి అభిమానులు సోషల్‌మీడియా వేదికగా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చెయ్యి పట్టుకోవే చిన్నారి మైనా..

తల్లీకూతుళ్ల అనుబంధమే ప్రధానాంశంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'శబరి'. వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధానపాత్ర పోషించిన ఈ చిత్రానికి అనిల్ కాట్జ్ దర్శకుడు. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాత. వచ్చే నెల 3న సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ చిత్రంలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. 'నా చెయ్యి పట్టుకోవే చిన్నారి మైనా.. మబ్బుల్లో తేలిపోదా రివ్వు రివ్వునా..' అంటూ సాగే ఈ పాటను రహమాన్ రాయగా, గోపీసుందర్ స్వరపరిచారు. అమృతా సురేశ్ ఆలపించారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ, మలయాళ, కన్నడ వెర్షన్స్‌లో కూడా ఈ పాటను విడుదల చేయడం విశేషం. వరలక్ష్మీ శరత్‌కుమార్, వివేక్ష మీద తెరకెక్కిన ఈ పాటను కొడైకొనాల్ కొండల్లోని అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించారు. తల్లీకూతుళ్లిద్దరూ విహారయాత్రకు వెళ్లే సమయంలో వచ్చే పాట ఇదని విజువల్స్ చెబుతున్నాయి. కథలో కీలక సందర్భంలో ఈ పాట వస్తుందని, భావోద్వేగాలతో కూడిన సైకలాజికల్ థ్రిల్లర్ ఇదని నిర్మాత తెలిపారు. గణేశ్ వెంకట్రామన్, శశాంక్, మైమ్ గోపీ, సునయన తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రచనా సహకారం: సన్నీ, నాగబాబు, కెమెరా: రాహుల్ శ్రీవత్సవ, నాని చమిడిశెట్టి.